సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం


చెక్కులు అందిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

రాంగోపాల్‌పేట్: దేశంలో ఎక్కడ లేని సంక్షేమ పథకాలు తెలంగాణలోనే అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మారేడుపల్లిలోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్లో సోమవారం ఆయన 85 షాదీ ముబారక్, 89 మందికి కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేసి మాట్లాడారు. గతంలో పేద, మధ్య తరగతి ఆడపిల్లల పెళ్లికి ఆర్థికంగా ఇబ్బందులు పడేవారని వాటిని గుర్తించిన సీఎం కేసీఆర్ ఈ పథకాలను ప్రవేశపెట్టి అండగా నిలిచారన్నారు. గత ప్రభుత్వాలు కేవలం రూ.200 మాత్రమే పింఛన్లు ఇస్తే ప్రస్తుతం రూ.2 వేలకు పెంచారని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులను ప్రైవేటుకు దీటుగా సౌకర్యాలను మెరుగుపరిచి అన్ని రకాల వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. పేద ప్రజల పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాల్లో అధునాతన వసతులు కల్పిస్తున్నారని వాటి కోసం రూ.7200 కోట్లను ప్రభుత్వం మన బస్తీ మన బడి కార్యక్రమం కింద కేటాయించి ఖర్చు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొంతం దీపిక, కొలను లక్ష్మి, హేమలత, మహేశ్వరి, మాజీ కార్పొరేటర్లు నామ శేషుకుమారి, అత్తెల్లి అరుణగౌడ్, ఆర్డీవో వసంత, తహసీల్దార్లు శైలజ, విష్ణుసాగర్, అహల్యా పాల్గొన్నారు.

క్లుప్తంగా...

రేపు ఆత్మీయ సమ్మేళనం

బౌద్ధనగర్: ఈ నెల 5వ తేదీన బౌద్ధనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కార్పొరేటర్ కంది శైలజ చెప్పారు. పార్శీగుట్ట ప్రాంతంలోని రాఘవ గార్డెన్ వద్ద నిర్వహించే ఆత్మీయ సమ్మేళనంలో డిప్యూటీ స్పీకర్ పద్మారావు, దాసోజు శ్రవణ్ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.15, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 47, పచ్చకాకర 45, పందిరి బీర 45, క్యాబేజీ 12, క్యారెట్ 17, దొండ 35, గుండుబీన్స్ 70, గింజ చిక్కుడు 60, గోకరకాయ 50, కీర 13, దోసకాయ 28, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 15, ఆలుగడ్డ 18, చామగడ్డ 55, మొరంగడ్డ 13, కందగడ్డ 38, సొరకాయ 9, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 3–5. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

వస్త్ర ప్రదర్శనకు స్పందన

రసూల్‌పురా: మగువల మనసు దోచే వస్త్ర ప్రదర్శన మహిళలను ఆకట్టుకుంటోంది. తిరుమలగిరి ఎస్‌బీహెచ్ కాలనీలోని ప్లాట్ నంబర్– 31లో సద్గుణ ఆర్ట్ క్రియేషన్స్ పేరిట ఏర్పాటు చేసిన వస్త్ర ప్రదర్శనకు స్పందన వస్తోందని నిర్వాహకులు పేర్కొన్నారు. కోటా, కంచిపట్టు, కాటన్, టస్కర్స్, మంగళగిరి, సిఫాన్, జార్జెట్, ఉప్పాడ, టాప్స్‌లో అందుబాటులో ఉంచామని స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శాస్త్రీయ నృత్యంలో ఉచిత శిక్షణ

సనత్‌నగర్: నాట్య శిల్పి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నాట్యం, సంగీతంలో ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు నాట్యాచార్యులు వానుకీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలోని శివాలయం హాల్లో ఈ నెల 25వ తేదీ నుంచి కూచిపూడి, ఆంధ్రనాట్యం, శివ తాండవం, శాస్త్రీయ నృత్యం, జానపదం, దాండియా, లలిత సంగీతంలో శిక్షణ ఉంటుందన్నారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు కొనసాగుతుందన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి


కంటి అద్దాలు అందజేస్తున్న శ్రీలతా శోభన్‌రెడ్డి

లాలాపేట: కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డి పేర్కొన్నారు. తార్నాక డివిజన్ లాలాపేట వినోభానగర్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. కంటి సమస్యలు ఉన్న వారు సమీపంలోని కేంద్రాలకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో శోభన్‌రెడ్డి, బండెల స్వామి, గంధమల్ల రాజలింగం, నాచారం బల్‌రాం, అనసూయమ్మ, శ్యామ్, నాగులు, మహేశ్వరీ పాల్గొన్నారు.

11 కేంద్రాలు.. 2700 మంది విద్యార్థులు

'పది' పరీక్షలు ప్రారంభం

అమీర్‌పేట: అమీర్‌పేట మండల పరిధిలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. మొత్తం 11 సెంటర్లు ఉండగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులతో కలిసి మొత్తం 2700 మంది హాజరవుతున్నారని ఉప విద్యాధికారి యాదయ్య తెలిపారు. కరోనా కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో తప్పని సరిగా మాస్కులు ధరించి రావాలని సూచించినట్లు తెలిపారు. ఆయా కేంద్రాల వద్ద ఓఆర్‌ఆర్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. సెల్‌ఫోన్‌లను కేంద్రంలోకి అనుమతించలేదని సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూయించి వేశామన్నారు. ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచిన ప్రశ్నాపత్రాలను ప్రతిరోజు అరగంట ముందు పోలీసుల భద్రతతో ఆయా కేంద్రాలను తరలించేలా ఏర్పాట్లు చేశామని యాదయ్య తెలిపారు.

చిలకలగూడ పరిధిలో 12 కేంద్రాల్లో..

చిలకలగూడ : చిలకలగూడ ఠాణా పరిధిలోని 12 కేంద్రాలలో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభం అయ్యాయి. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆయా పరీక్ష కేంద్రాల వద్ద తగిన వసతులు కల్పించారు. తల్లిదండ్రులు, కుటుంబసభ్యులతో కలిసి విద్యార్థులు గంట సమయం ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పలు కూడళ్లు, చౌరస్తాల వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా గోపాలపురం ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చిలకలగూడ ఇన్‌చార్జ్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ నరేష్ తెలిపారు.

సికింద్రాబాద్ మండల పరిధిలో..

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ మండల పరిధిలో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. మొదటి రోజు కావడంతో పరీక్షా కేంద్రాల వద్దకు గంట ముందు నుంచే విద్యార్థులు చేరుకున్నారు. విద్యార్థులకు తల్లిదండ్రులు ధైర్యం చెబుతూ కనిపించారు. సికింద్రాబాద్ మండల పరిధిలో మొత్తం 14 కేంద్రాల్లో 3080 మంది విద్యార్థులు ఉండగా అందులో 2589 మంది విద్యార్థులు హాజరయ్యారని, ఇందులో 2622 రెగ్యులర్ విద్యార్థులు కాగా మిగతా వాళ్లు ప్రైవేటు విద్యార్థులని డిప్యూటీ ఈవో రమణమూర్తి చెప్పారు.

ఓ సామాజిక వర్గాన్ని దూషించిన రౌడీషీటర్‌పై కేసు

అమీర్‌పేట: ఓ సామాజిక వర్గాన్ని కించపరుస్తూ బెదిరింపులకు పాల్పడ్డ రౌడీషీటర్‌పై ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండ శ్రీరామ్‌నగర్ శివాలయం సమీపంలో ఉండే మెకానిక్ నానావత్ సర్దార్ సింగ్ అలియాస్ రమేష్ నాయక్, శ్రీరామనవమి రోజు ర్యాలీ నిర్వహించాడు. ఇదే ప్రాంతంలో నివసించే రౌడీషీటర్ నీలం రతన్‌కుమార్ అలియాస్ చింటు, గత నెల 31న రమేష్ స్నేహితుడైన ప్రవీణ్‌కుమార్‌కు ఫోన్‌చేసి రమేష్ నాయక్‌తో పాటు ఆ సామాజిక వర్గాన్ని కించపరిచేలా మాట్లాడాడు. ఈ నెల1వ తేదీన రమేష్, చింటుకు ఫోన్ చేసి తమను ఎందుకు తిడుతున్నావని ప్రశ్నించగా తనను కాదని ర్యాలీ ఎందుకు తీశారని రమేష్, అతడి సామాజిక వర్గం మహిళలను అసభ్యకరంగా కులం పేరుతో మళ్లీ దూషించాడు.మరుసటి రోజు చింటు సోదరుడైన బంటి వారిని తిట్టిన ఫోన్ రికార్డును వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేశాడు. దీంతో రమేష్ నాయక్ అన్నదమ్ములు ఇద్దరిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

స్వచ్ఛసర్వేక్షణ్‌లో ప్రథమ ర్యాంక్ వచ్చేలా పనిచేయాలి


శానిటరీ సిబ్బందితో మాట్లాడుతున్న మహేందర్

కంటోన్మెంట్: దేశంలోనే అతిపెద్ద కంటోన్మెంట్ అయిన సికింద్రాబాద్‌కు ఈ సారి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రథమ ర్యాంకు వచ్చేలా పనిచేయాలని బోర్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేందర్ పిలుపునిచ్చారు. సోమవారం బోయిన్‌పల్లి సర్కిల్ కార్యాలయం ఆవరణలో శానిటరీ సిబ్బంది, చెత్త సేకరణ కార్మికులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాది ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు నాలుగో స్థానం వచ్చిందని ఈ సారి మరింత సమర్థంగా పనిచేసి తొలిస్థానం దక్కించుకోవాలన్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయి సిబ్బంది శక్తి వంచన లేకుండా పనిచేయాలన్నారు. ముఖ్యంగా ప్రాథమిక దశలోనే తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని ఇందు కోసం కమర్షియల్ భవనాలతో పాటు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలన్నారు. ఇక ప్రమాదకరమైన ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వ్యర్థాలను వేరుచేస్తే డంపింగ్ యార్డులో చెత్తను వేరు చేసే సమస్య తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అసుతోష్ చౌహాన్, స్వచ్ఛ సర్వేక్షన్ ఇన్‌చార్జ్ దీపక్, దఫేదార్లు గణేశ్, నర్సింహరాజు, నరేశ్ పాల్గొన్నారు.

పెళ్లికి నిరాకరించాడని యువతి ఆత్మహత్య

అడ్డగుట్ట: ప్రేమించిన వ్యక్తి పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపానికి గురైన యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ మధులత వివరాల ప్రకారం.. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లోని కొత్తపల్లి గ్రామానికి చెందిన జీడీ. శ్రావ్య (23) ఎంబీఏ పూర్తి చేసి నాలుగు నెలల క్రితం నగరానికి వచ్చి తార్నాక విజయపురి కాలనీలోని ఓ హాస్టల్లో ఉంటూ అదే ప్రాంతంలోని నైపుణ్యం ట్యాక్స్ కంపెనీలో ట్యాక్స్ ఫైలింగ్ టీం లీడర్‌గా పని చేస్తుంది. జనగామకు చెందిన తన బంధువైన సుధాకర్ వీడియో గ్రాఫర్‌గా పని చేస్తున్నాడు. అతనితో శ్రావ్యకు నాలుగేళ్లుగా ప్రేమ వ్యవహారం ఉంది. కొన్ని రోజులుగా సుధాకర్ ప్రవర్తనలో మార్పు వచ్చింది. శ్రావ్యను పెళ్లి చేసుకోవడం ఇష్టం లేనట్టుగా ప్రవర్తించాడు. ఈ క్రమంలో శ్రావ్య అతన్ని గట్టిగా అడగ్గా తనను పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదని తేల్చి చెప్పాడు. ఇదే విషయం శ్రావ్య ఆదివారం రాత్రి తన తండ్రి క్రిష్ణకు ఫోన్ చేసి చెప్పి అదే రోజు అర్ధ రాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఆలస్యంగా గమనించిన హాస్టల్ నిర్వాహకుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. తండ్రి క్రిష్ణ ఫిర్యాదు మేరకు సుధాకర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ దొంగల రిమాండ్


మురళీఅజయ్, జయకృష్ణ

చిలకలగూడ: పార్కింగ్ చేసిన వాహనాన్ని చోరీ చేసిన ఇద్దరిని రిమాండ్‌కు తరలించిన ఘటన చిలకలగూడ ఠాణా పరిధిలో జరిగింది. ఇన్‌చార్జ్ ఏసీపీ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. చిలకలగూడ లైఫ్‌స్ప్రింగ్ ఆస్పత్రి ప్రాంతానికి చెందిన షేక్ అబ్దుల్ గతనెల 30న ఇంటి ముందు తన ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేశాడు. ఉదయం తన వాహనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చిలకలగూడ చింతబావికి చెందిన మురళీ అజయ్ (18), ఓ ఆస్పత్రిలో డయాలసిస్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న జయకృష్ణ (20) మిత్రులు. జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బులు సంపాదించేందుకు బైక్ దొంగతనం చేయాలని నిర్ణయించుకుని షేక్‌అబ్దుల్ వాహనాన్ని చోరీ చేశారు. సోమవారం ఉదయం వారాసిగూడ చౌరస్తాలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అటుగా వచ్చిన వారు పోలీసులను చూసి పరారయ్యేందుకు యత్నించారు. అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిని రిమాండ్‌కు తరలించామన్నారు.

అందుబాటులో ఉంటాం.. సమస్యలు పరిష్కరిస్తాం


స్థానికులతో మాట్లాడుతున్న లాస్య నందిత, నివేదిత

రసూల్‌పురా: తన తండ్రి ఆశయాలకు అనుగుణంగా తాము ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తెలు హామీ ఇచ్చారు. కంటోన్మెంట్ నియోజకవర్గం రసూల్‌పురా లోని సిల్వర్ కాంపౌండ్ డబుల్ బెడ్రూమ్ సముదాయం వద్ద సాయన్న విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించి అనంతరం 105 గల్లీల్లో పర్యటించి తాగునీటి కనెక్షన్ల పనులు, సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ప్రతి బ్లాక్ వద్ద నల్లా కనెక్షన్లు ఇచ్చినా నీటి సరఫరా జరగడం లేదని కొన్ని చోట్ల నల్లాలు చోరీకి గురయ్యాయని ఈ సందర్భంగా స్థానిక మహిళలు వారి దృష్టికి తీసుకురాగా స్పందించిన వారు మాట్లాడుతూ.. రెండు రోజులకు ఒకసారి తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటామని అదే విధంగా త్వరలో డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు తాగునీటి సరఫరా జరుగుతుందన్నారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, దేవులపల్లి శ్రీనివాస్, షేక్ నయీం, నరేష్, యాదగిరి, సందీప్, నిస్సార్, కుమార్, నర్సింహ్మ పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం నిర్మాణానికి స్థల పరిశీలన


నిర్మాణ స్థలంలో అధికారులతో చర్చిస్తున్న కార్పొరేటర్ హేమ

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్‌లో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి స్థల పరిశీలన చేసినట్లు కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ ఆదేశాల మేరకు జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఏఈ కౌశిక్‌తో కలిసి సోమవారం ఆమె డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. చిలకలగూడ ఫ్రైడే మార్కెట్ సమీపంలోని జీహెచ్‌ఎంసీకి చెందిన ఖాళీస్థలం ఇండోర్ స్టేడియం నిర్మాణానికి అనువైనదిగా గుర్తించామన్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో పార్కింగ్, మొదటి అంతస్తులో షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, స్నూకర్ తదితర క్రీడలకు సంబంధించి కోర్టులను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఆమోదం కోసం పంపనున్నట్లు ఆమె వెల్లడించారు సీఎం కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం క్రీడలు, క్రీడాకారులను ఎంతగానో ప్రోత్సహిస్తుందన్నారు. ఇండోర్ స్టేడియం బ్లూ ప్రింట్‌ను త్వరలోనే సిద్ధం చేస్తామని జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. కార్పొరేటర్ వెంట వైద్యాధికారిణి ఫణి, సిబ్బంది గీత,రేఖ, సికింద్రాబాద్ షటిల్ రైడర్స్ అసోషియేషన్ ప్రతినిధి బిట్ల రఘునందన్ ఉన్నారు.

ఓయూ మెట్లబావి పునరుద్ధరణకు చర్యలు


మెట్ల బావిని పరిశీలిస్తున్న అధికారులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ బీఈడీ కాలేజీలోని పురాతన మెట్లబావి పునరుద్ధరణకు చర్యలు చేపట్టనున్నట్లు జీహెచ్‌ఎంసీ అధికారి కల్పన రమేష్ పేర్కొన్నారు. సోమవారం ఆమె ఓయూ వీసీ ప్రొ.రవిందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణతో పాటు ఇతర అధికారులతో కలిసి మెట్ల బావిని సందర్శించి మాట్లాడారు. నగరంలో 80 పురాతన మెట్లబావులు ఉన్నాయని అందులో ఇంత వరకు 10 బావులకు మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించామన్నారు. బన్సీలాల్‌పేట మెట్లబావి తరహాలోనే ఇతర మెట్ల బావులను జీహెచ్‌ఎంసీ, హెచ్ఎండీఏల సహకారంతో సుందరీకరణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. అనంతరం ఓయూ విద్యార్థులు, అధికారులతో పాటు జీహెచ్‌ఎంసీ, ఎచ్‌ఎండీఏ అధికారులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మెట్ల బావి చుట్టూ ఉన్న చెత్తను తొలగించారు.

డిజిటల్ రంగంలో నైపుణాన్ని పెంపొందించాలి


మాట్లాడుతున్న జయేష్ రంజన్

కంటోన్మెంట్: విద్యార్థి దశ నుంచే డిజిటల్ రంగంలోనూ తగిన నైపుణ్యాన్ని అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పరిశ్రమలు, వాణిజ్య శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. కంటోన్మెంట్ బాపూజీనగర్‌లోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో సాలేరా/స్మార్ట్ డ్రైవ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, తెలంగాణ సోషల్ ఇంపాక్ట్ గ్రూప్ (టీ–ఎస్ఐజీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిజిటల్ తరగతుల ద్వారా విద్యార్థులు తమ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేసుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద రూ.27 లక్షలు వెచ్చించి కంప్యూటర్లు, ప్రొజెక్టర్లు, ఆడియో స్పీకర్లు ఏర్పాటు చేశారు. సంబంధిత ఉపాధ్యాయులకు కంప్యూటర్ బోధనలో మార్చి నెలలోనే శిక్షణ కూడా ఇచ్చారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలోని 370 మందికి పైగా విద్యార్థులకు ఈ తరగతులు ఎంతో దోహదపడ్తాయి. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ క్రిస్టినా జెడ్ చోంగ్తూ, సాలేరా/ స్మార్ట్ డ్రైవ్ ఇండియా ఫైనాన్స్ హెడ్ దర్శన బాంటియా, టీ–ఎస్ఐజీ తెలంగాణ హెడ్ అర్చన సురేశ్, సంక్షేమ శాఖ ఏడీ వి. సర్వేశ్వర్ రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ చందన, డీటీడీఓ కేతు, సోమేశ్వరి దేవీ, ఆశ్రమ పాఠశాల హెడ్ మాస్టర్ బి. లాలూ పాల్గొన్నారు.

ఇద్దరు మద్యం విక్రేతలపై కేసు

చిలకలగూడ : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇరువురిపై కేసు నమోదు చేసిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేష్ వివరాల ప్రకారం.. పార్శిగుట్ట అంబర్‌నగర్‌కు చెందిన పారిజాత (40) బన్నీ (21) తల్లీ కొడుకులు. మద్యం కొనుగోలు చేసి అర్ధరాత్రి దాటిన తర్వాత అవసరమైన వారికి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ హరీష్ నేతృత్వంలో ఈ నెల 2వ తేదీ రాత్రి నిల్వ ఉంచిన ఇంటిపై దాడి చేసి 50 మద్యం బాటిళ్లు, రూ. 1410 నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. బన్నీ పోలీసులకు పట్టుబడగా, పారిజాత పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు.

అభివృద్ధి పనులు చేపట్టాలని వినతి




అడ్డగుట్ట: అడ్డగుట్ట డివిజన్‌లో పలు అభివృద్ధి పనులు చేపట్టాలని సికింద్రాబాద్ జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి గాజుల హంసరాజు జలమండలి మారేడుపల్లి డివిజన్ జీఎం రమణారెడ్డిని కోరారు. సోమవారం ఆయన కార్యాలయంలో కలిసి అడ్డగుట్టలోని మంచినీటి పైప్‌లైన్లు, డ్రైజేజీ పైప్‌లైన్, వాల్వ్, బోర్‌వెల్స్ మరమ్మతులపై చర్చించారు. అవసరం ఉన్న చోట వెంటనే కొత్త వాటిని ఏర్పాటు చేయాలని సూచించారు. వేసవిలో ముందు జాగ్రత్తలు చర్యలు తీసుకుంటే నీటి ఎద్దడిని నివారించవచ్చని వినతిలో పేర్కొన్నారు.

కడియం రాజుకు ఘన నివాళి

ఉస్మానియా యూనివర్సిటీ: క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో సోమవారం జరిగిన ఏబీవీపీ జాతీయ నాయకులు దివంగత కడియం రాజు శ్రద్ధాంజలి సభలో పలువురు పాల్గొని రాజు చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థి సమస్యలతో పాటు ఓయూ భూముల పరిరక్షణలో విశేష కృషి చేశారన్నారు. రాజు భార్య సాగరిక, తల్లి సువార్త, తండ్రి తిరాజ్, ఆర్‌ఎస్‌ఎస్ జాతీయ నాయకులు బాగయ్య, బీజేపీ ఏపీఎస్ రెడ్డి, మురళీధర్‌రావు పేరాల శేఖర్, హెచ్‌సీయూ అధ్యాపకులు డాక్టర్ వీరబాబు, గుంత లక్ష్మన్, ప్రొ.శంకర్, డాక్టర్ రామకృష్ణ, మురళీమనోహార్ పాల్గొన్నారు.

ఓయూ సందర్శన



పాలస్తీనా రాయబారి అబేద్ ఎల్రాజెగ్ అబు జాజెర్ సోమవారం ఓయూను సందర్శించారు. పాలన భవనంలో వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్‌తో వివిధ అంశాల పై చర్చించారు. బోధన, పరిశోధనలో పరస్పరం ఓయూతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

–ఉస్మానియా యూనివర్సిటీ